అడుగంటుతున్న జలం

- ఆందోళనలో జనం
- నియోజకవర్గంలోని చెరువుల్లో తగ్గిపోతున్న నీరు
- జాడలేని సాగర్ జలాలు

జి.కొండూరు: చెరువుల్లో నీరు అడుగంటుతుండటంతో జనం ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో భూగర్భజలాలు తరిగిపోతున్నాయి. సాగర్ జలాల జాడే లేదు. మార్చి ప్రారంభంలోనే కరవు ఛాయలు కనిపిస్తున్నాయి. బోర్లలో నీరు కూడా ఎండిపోతే నీటి కొరతతో నరకయాతన పడాల్సి వస్తుందేమోనని భయాందోళనకు గురవుతున్నారు. రబీసాగు అక్కడక్కడా ఎండుముఖం పడుతోంది. వరదల కారణంగా ఖరీఫ్ నష్టపోయిన రైతులకు రబీ కూడా ఆశాజనకంగా లేదు.

బోర్లలో నీటి మట్టం తగ్గిపోతుండడంతో సాగుకు సక్రమంగా నీరందక రబీలో సాగు చేసిన మొక్కజొన్న ఎండుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి మైలవరం నియోజకవర్గానికి సాగర్ జలాలను తీసుకొచ్చి చెరువులు నింపకపోతే కరవుకోరల్లో చిక్కుకోక తప్పదని ప్రజలు వాపోతున్నారు.

జల కళ ఏదీ

మైలవరం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 80 శాతానికి పైగా చెరువుల్లో నీరు అడుగంటి వెలవెలబోతున్నాయి. గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరదల కారణంగా నియోజకవర్గంలో 32 చెరువులకు గండ్లు పడి నీరు వృథా అయింది. ఆ తర్వాత వర్షాలు పడినా గండ్లు పూడ్చకపోవడంతో నీరు నిల్వలేదు. సాగర్ జలాల జాడ కూడా లేక మిగిలిన చెరువుల నీటిని ఖరీఫ్ సాగుకు వినియోగించారు. దీంతో చెరువుల్లో నీరు అడుగంటింది. చెరువుల్లో కొద్దిపాటి నీటిని కూడా చేపలు పట్టడానికి మోటార్లతో బయటకు పంపుతుండటంతో చెరువులు పూర్తిగా ఎండిపోతున్నాయి.


పూర్తిగా ఎండిపోయి నెర్రెలువారిన పినపాక గంగాదేవి చెరువు


నీరులేక వెలవెలబోతున్న వెల్లటూరు బందుచెరువు

మైలవరం నియోజకవర్గంలో చెరువులు, సాగుభూమి వివరాలు

మండలం	గ్రామ పంచాయతీలు	చెరువులు	వ్యవసాయ భూమి హెక్టార్లు
జి.కొండూరు	22	38	12,800
మైలవరం	13	24	8,800
రెడ్డిగూడెం	12	69	13,600
ఇబ్రహీంపట్నం	10	08	3,200
విజయవాడ రూరల్	05	05	2,800


కుంటముక్కల గ్రామ శివారులో ఎండిపోయిన మొక్కజొన్న పైరు

నియోజకవర్గంలో రబీ సాగు వివరాలు హెక్టార్లలో

మండలం	వరి	మొక్క జొన్న	జొన్న	శెనగ
జి.కొండూరు	559.80	373.29	5.05	-
మైలవరం	171.52	753.35	8.05	-
రెడ్డిగూడెం	849.02	236.18	1.00	-
ఇబ్రహీం పట్నం	889.37	660.07	38.85	342.90

మట్టి తవ్వకాల కోసం

చెరువుల్లో నీరు అడుగంటి ప్రజలు అల్లాడుతుంటే అక్రమార్కుల చెరువుల్లో మట్టిని తవ్వి సొమ్ము చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. చెరువుల్లో సాగర్ జలాలు నింపితే మట్టి తవ్వకాలకు ఆటంకం ఏర్పడుతుందనే నెపంతో వాటి కోసం ప్రయత్నాలు కూడా చేయడంలేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని చేపలు పట్టే నెపంతో బయటకు తరలించి మట్టి తవ్వకాలకు సిద్ధం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సాగర్ జలాలు రాకపోతే కరవే



ప్రభుత్వం వెంటనే స్పందించి మైలవరం నియోజకవర్గానికి సాగర్ జలాలు తీసుకురాకపోతే కరవు కోరల్లో చిక్కుకోవాల్సి వస్తుంది. ప్రజలతో పాటు మూగ జీవాలకు కూడా నీరు దొరక్క ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఇప్పటికే చెరువుల్లో నీరు అడుగంటుతోంది. భూగర్భజలాలు పాతాళంలో ఉన్నాయి.

–చెరుకూరి శ్రీనివాసరావు,
రైతు సంఘం నాయకుడు, కవులూరు,

నీటిని విడుదల చేయాలి



చెరువులు ఎండిపోతున్నాయి. మార్చి నెలలోనే ఈ పరిస్థితి ఉంటే మే నెలలో నీరు దొరకడమే కష్టంగా మారుతుంది. సాగర్ జలాలను తీసుకొచ్చి చెరువులు నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయి. బోర్లలో నీటి మట్టం పెరిగి ఆరుతడి పంటలకు ఇబ్బంది ఉండదు. నీటి సమస్య తీరుతుంది.

–కోన పాండురంగారావు(బుజ్జి),
రైతు, మునగపాడు

క్లుప్తంగా

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

మునునూరు: పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. సోమవారం చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్లో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి విద్యార్థులు విజయం సాధించాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. హెచ్ఎం అబ్బాస్, స్టాఫ్ సెక్రటరీ పద్మకిషోర్, ఉపాధ్యాయులు రాజశేఖర్, రాంబాబు, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

తిరువూరు: విద్యార్థులు ఖాళీ సమయాల్లో సెల్ ఫోన్లకు ఆకర్షితులవకుండా పుస్తక పఠనం అలవర్చుకోవాలని పెనుగొలను శాఖా గ్రంథాలయాధికారి శ్రీలత కోరారు. సోమవారం పెనుగొలను ఎంపీపీ స్కూల్ విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడ లభించే విజ్ఞాన వినోదదాయక పుస్తకాలను గ్రంథాలయాధికారి వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు పాల్గొన్నారు.

విగ్రహాల పునఃప్రతిష్ఠ



జి.కొండూరు: చెవుటూరులో సోమవారం విజయ గంగానమ్మ, దాసాంజనేయస్వామి వార్ల ఆలయాలు, విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. వీటికి వైఎస్సార్ సీపీ మైలవరం సమన్వయకర్త జోగి రమేష్ హాజరయ్యారు. ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పరిశ్రమల యాజమాన్యాలు పరిసర గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని పరిశ్రమల శాఖ రాష్ట్ర డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ టి.రాజు తెలిపారు. కొండపల్లి పారిశ్రామికవాడలో వారం నుంచి నిర్వహిస్తున్న 54వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు సమావేశంలో సోమవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు భద్రతా పరికరాలు తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్లపై భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పరిశ్రమల భద్రత, కార్మికుల శ్రేయస్సుకు ప్రభుత్వ విధివిధానాలు పాటించాలని స్పష్టం చేశారు. సమావేశంలో యూనిట్ హెడ్ లక్ష్మీకాంత్, ఈహెచ్ఎస్ మేనేజర్ అమన్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

నెమలి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

తిరువూరు: నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 14న జరగనున్న స్వామివారి కల్యాణోత్సవాల ఏర్పాట్లను తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురి సోమవారం పరిశీలించారు. కల్యాణోత్సవాలను తిలకించడానికి గ్యాలరీ, స్వామివారి దర్శనానికి క్యూలైన్లను పటిష్టంగా నిర్మించాలని, తాగునీరు, విద్యుత్ సదుపాయాల్లో ఇబ్బంది రాకుండా చూడాలని ఆదేశించారు. అవసరం మేరకు ఆర్టీసీ సర్వీసులను నడపాలన్నారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆలయ సహాయ కమిషనర్ సంధ్యకు సూచించారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లను తిరువూరు సీఐ గిరిబాబు వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

తిరువూరు: కృష్ణా జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన 34వ సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తిరువూరు మండలం మల్లేల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 7న మొవ్వలో జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఈ పాఠశాల విద్యార్థులు కంపా వైష్ణవి, నాళ్లా విజయతేజశ్రీ, గోపిదేశి చైతన్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ తెలిపారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ కృష్ణనాయక్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

సారా తయారీదారుల అరెస్టు

చాట్రాయి: నాటు సారా తయారీదారులను అరెస్టు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్సై మస్తాన్‌రావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని పోతనపల్లి తండాకు చెందిన డి.బుజ్జి, లావూరి కాంతమ్మ నాటుసారా తయారీ చేస్తుండడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి


నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు తీసుకుంటున్న సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

నూజివీడు: సమస్యలు మండల స్థాయిలో పరిష్కారం కావడం లేదని, మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని అర్జీదారులు సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. దీనిలో భాగంగా డివిజన్‌లోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వారి సమస్యల పరిష్కారం నిమిత్తం ఇచ్చిన అర్జీలను సబ్ కలెక్టర్ స్వీకరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు గడువులోగా నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలన్నారు. మొత్తం 20 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు.

కొన్ని అర్జీలు..

- తన ఇంట్లో ఉంటున్న వ్యక్తి అద్దె చెల్లించడం లేదని, ఫోన్‌చేసి అద్దె ఇవ్వాలని అడిగితే నిరాకరిస్తున్నాడని, ఖాళీ చేయమంటే బెదిరిస్తున్నాడని సింగంపల్లి అప్పారావు అర్జీ అందజేశాడు.
- తనకు వంట గ్యాస్ కనెక్షన్ ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఉందని, అయితే ఉచిత గ్యాస్ పథకం కింద బుక్ చేసుకొని నెలలు గడుస్తున్నా తనకు రాయితీ నగదు బ్యాంకు ఖాతాలో పడలేదని, చాట్రాయి మండలం నరసింహారావుపాలెంకు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశారు.

నిర్బంధ వసూలు సంపద సృష్టా ?

నూజివీడు: పట్టణంలోని ప్రజలు నీటి పన్ను చెల్లించలేదని చెప్పి కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు కుళాయిలను డమ్మీ చేయడం సమంజసం కాదని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎండాకాలం అని కూడా ఆలోచించకుండా మున్సిపల్ అధికారులు పాలకవర్గానికి సంబంధం లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ప్రజలు తిరగబడటం ఖాయమన్నారు. నోటీసులు ఇచ్చి కనీసం నెల రోజులు చూడాలని, పది రోజులకే కుళాయిలను డమ్మీ చేస్తే ప్రజలు మంచినీటి కోసం ఎక్కడకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజల నుంచి నిర్బంధంగా పన్నులు వసూలు చేయడమే.. సంపద సృష్టా అని ప్రశ్నించారు. 9 నెలల కాలంలో అభివృద్ధి లేదు.. సంక్షేమం లేదు.. అప్పులు మాత్రం పెరిగిపోతున్నాయని దుయ్యబట్టారు. మోసం చేసే వారికి బటన్ నొక్కడం ఎంత మాత్రం రాదని ఎద్దేవా చేశారు. ప్రతాప్ అప్పారావుతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, నాయకులు చేబత్తిన మున్నా, తలారి సతీష్, కంచర్ల లవకుమార్, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

9 నెలల్లో రూ.లక్ష కోట్లకు పైగా అప్పు


నూజివీడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, నేతలు


ఇబ్రహీంపట్నంలో యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వి.తిరుపతిరావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గడిచిన 9 నెలల కాలంలో లక్ష కోట్లకు పైగా అప్పు చేసిందని, ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయలేదని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. నూజివీడులో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా వారి చదువులు మధ్యలో ఆగిపోయేలా చేయడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న ఏలూరులో నిర్వహించే వైఎస్సార్ సీపీ యువత పోరును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యువత పోరుకు పిలుపునిచ్చిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గాలకు చెందిన విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం యువతను కూడా నిలువునా మోసం చేసిందని, అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వైద్య సీట్లను ఇస్తామంటే రాష్ట్ర ప్రభుత్వం వద్దని చెప్పిందంటే ప్రభుత్వ తీరు ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు నవుడు నాగమల్లేశ్వరరావు, నాయకులు చేబత్తిన మున్నా, తలారి సతీష్, కంచర్ల లవకుమార్, షేక్ మస్తాన్, అత్తి మురళీ, షేక్ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మాజీ మంత్రి జోగి రమేష్ నివాసంలో సోమవారం 'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు వేములకొండ తిరుపతిరావు, అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన పోరుబాట సాగించేందుకు ఈనెల 12న విజయవాడలో జరిగే యువత పోరు కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలివచ్చి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసంపై గళం విప్పుదామన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేద్దామన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో ఎంతో మంది పేదలు ఉన్నత చదువులతో డాక్టర్లు, ఇంజినీర్లుగా స్థిరపడ్డారని స్పష్టం చేశారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక వసతిదీవెన ద్వారా హాస్టల్ ఖర్చులు కూడా అందజేసినట్లు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. విద్యార్థులకు తక్షణం రూ.4,600 కోట్ల బకాయి చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.3 వేల నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రస్తావన బడ్జెట్లో కనిపించలేదన్నారు. కార్యక్రమంలో జికొండూరు జెడ్పీటీసీ సభ్యులు మందా జక్రధరరావు, పట్టణ అధ్యక్షులు జోగి రాము, మిక్కిలి శరభయ్య, ఎన్.శివశంకరరావు, పి.పండు, జోజి, జి.రాణి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలి

మునునూరు: తమపై పనిభారం తగ్గించాలని మండల పంచాయతీ కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్త పంచాయతీ కార్యదర్శుల సంఘం పిలుపుతో మండల పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఈఓపీఆర్డీ బీవీ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. అనంతరం యూనియన్ సభ్యులు మాట్లాడుతూ అన్నిరకాల సర్వేల పని భారం తమపైనే మోపడం సమంజసం కాదని, కుటుంబ సభ్యులతో గడిపే అవకాశం లేని పరిస్థితిలో జీవనం సాగిస్తున్నామని వాపోయారు. కార్యక్రమంలో మండల కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సుకుమార్, నీరజ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

మునునూరు: నిమ్న వర్గాల బతుకులు మార్చడానికి బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవితాంతం కృషి చేశారని ఇన్‌కం ట్యాక్స్ విశ్రాంత కమిషనర్, ఐఆర్ఎస్ అధికారి ఉప్పులేటి దేవిప్రసాద్ అన్నారు. చెక్కపల్లి అంబేడ్కర్ కాలనీ వద్ద అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఏపీటీడీపీఏ కార్యదర్శి, విశ్రాంత మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జాలా రాజారావు అధ్యక్షతన పలువురు ఉన్నతాధికారులు, విశ్రాంత అధికారులతో కలసి ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఆర్‌కే బెనర్జీ, వేణుగోపాలరావు, పోలీసు ఉన్నతాధికారులు గోసాల మురళీకృష్ణ, పెయ్యల రాజేష్, కొసరాజు వెంకట సుబ్బారావు, రుద్రపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో పారిశుద్ధ్య పనులు

చాట్రాయి: మండలంలోని పోలవరం పంచాయతీ సర్పంచ్ సత్తెనపల్లి లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్ల పక్కన చెత్త కుప్పలు, తుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

పది పరీక్షలకు హాజరుకానున్న 5,568 మంది

నూజివీడు: ఈ నెల 17 నుంచి పదో తరగతి పరీక్షలకు నూజివీడు డివిజన్‌లోని ఆరు మండలాల నుంచి 5,568 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు డీవైఈఓ ఎం.సేవియా సోమవారం తెలిపారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి 3,266 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 2,135 మంది, ప్రైవేటు విద్యార్థులు 167 మంది రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు 30 కేంద్రాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని కేంద్రం వద్దకు 8.30 గంటలకు విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. ఇన్విజిలేటర్లను ప్రతి మూడురోజులకొకసారి జంబ్లింగ్ విధానంలో మారతారని పేర్కొన్నారు. నూజివీడు పట్టణం, మండలం నుంచి 1,898 మంది, ఆగిరిపల్లిలో 586 మంది, ముసునూరులో 547 మంది, చాట్రాయిలో 502 మంది, చింతలపూడిలో 1397 మంది, లింగపాలెం మండలంలో 638 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవ్వనున్నారు.

గ్రామాల్లో సారా నిర్మూలనకు కృషి

మైలవరం: గ్రామాల్లో సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి తెలిపారు. రెడ్డిగూడెం మండలం ఓబులాపురం దత్తత అధికారి హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి నవోదయం 2.0లో భాగంగా సోమవారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామాల నుంచి సారా మహమ్మారిని తరిమికొట్టి గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ఆగిరిపల్లి: మండలంలోని వడ్లమానులో శనివారం విద్యుదాఘాతంతో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన జలసూత్రం నాగమణి కుటుంబ సభ్యులను మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలికి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తరఫున పక్కా ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మైలవరం: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దాడి చంద్రశేఖర్ తెలిపారు. మైలవరం ఎస్ఎస్ బాల్‌బ్యాడ్మింటన్ ఎరీనా నిర్వాహకులు చనుమోలు నాగభూషణం ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి షటిల్ డబుల్ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి జితేంద్ర అండ్ మునీర్(గుంటూరు), వంశీ అండ్ హిమదీప్(విజయవాడ) సెకండ్ ప్రైజ్, సాయి చరణ్ అండ్ పూజిత(మైలవరం) తృతీయ బహుమతి, దిలీప్ అండ్ సుజిత్ (నూజివీడు), నాలుగో బహుమతి, బెస్ట్ టీమ్‌గా ప్రేమ్ అండ్ ఆరిఫ్‌లు(మచిలీపట్నం) ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ బ్యాడ్మింటన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ వెంకయ్య స్వామి టెంపుల్ ఫీడర్ విద్యుత్ లైన్లతోపాటు 11 కేవీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్ర బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పంట కాలువ రోడ్డు, సాయిపురం కాలనీ, విల్లాస్ రోడ్డు, వెంకయ్య స్వామి టెంపుల్ ఏరియా, కమర్షియల్ కాంప్లెక్స్, బైపాస్ రహదారి, బాలాజీ టవర్స్, అంబేడ్కర్‌నగర్, టెలిఫోన్‌కాలనీ, వెంకటేశ్వర ఫౌండ్రీ ఏరియాలో పైన పేర్కొన్న సమయంలో కరెంట్ నిలిపి వేయనున్నట్లు వివరించారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించండి

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్‌లోని ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌కు ఆ సంస్థ ఉద్యోగులు సోమవారం వినతిపత్రం అందజేశారు. 2006 నుంచి హౌసింగ్ కార్పొరేషన్‌లో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మండల ఇన్‌చార్జులుగా విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భరోసా లేదని వివరించారు. మినిమం టైమ్ స్కేల్, హెచ్ఆర్ పాలసీ కల్పించాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మహిళలను సమాన శక్తిగా గుర్తించాలి

మునునూరు: మహిళలను సమాన శక్తిగా గుర్తించాలని ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ మండల కోఆర్డినేటర్ బుడుపుల జయశ్రీ పేర్కొన్నారు. మండలంలోని కొర్లగుంట శివారు సింహాద్రిపురంలో యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీని సోమవారం నిర్వహించారు. మహిళాభివృద్ధే–దేశాభివృద్ధి, మహిళలను ఎదగనీయాలని, దేశాన్ని కాపాడాలని కోరుతూ మహిళా సాధికారిక ర్యాలీని నిర్వహించారు. అన్ని రంగాల్లో మహిళలకు గౌరవ ప్రదమైన స్థానం కల్పించి, ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమాల్లో సభ్యులు మరీదు నాగేశ్వరమ్మ, మల్లేశ్వరి, కేశవ, కృష్ణవేణి, కుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.